సాక్షి గుంటూరు

గురువారం । 3 । అక్టోబర్ । 2024




ఆలయ అభివృద్ధికి విరాళం

తాడేపల్లిరూరల్: కంఠంరాజు కొండూరులో వేంచేసి ఉన్న మహంకాళీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన కొమ్మినేని నిస్‌నాథ్ రూ.లక్ష అందజేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 32,600 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 16,000 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 588.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,900 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. వేడుకలను పురస్కరించుకుని భ్రమరాంబ అమ్మవారు బాలా త్రిపుర సుందరి, గాయత్రి, అన్నపూర్ణ, లలితా త్రిపురసుందరి, కదంబ వనవాసిని, మహాలక్ష్మి, సరస్వతి, దుర్గ, మహిషాసురమర్దిని, రాజరాజేశ్వరి అలంకరణల్లో భక్తులను దర్శనం ఇవ్వనున్నారు. విజయదశమి రోజున ఉదయం మహాపూర్ణాహుతి, సాయంకాలం శమీపూజ నిర్వహించనున్నారు. రోజూ విశేష పూజలు, రాత్రివేళల్లో భక్తులకు కాలక్షేపంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ఆలయ ప్రాంగణం ఇప్పటికే విద్యుత్ కాంతులతో కళకళలాడుతోంది. గురువారం అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులను అనుగ్రహించనున్నారు.

మహాత్ముని సేవలు వెలకట్టలేనివి



గుంటూరు వెస్ట్: స్వాతంత్ర్య ఉద్యమాన్ని అహింసా మార్గంలో నడిపించి విజయం సాధించిన మహాత్మా గాంధీ సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కొనియాడారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని ఆయన విగ్రహం వద్ద కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ, అసిస్టెంట్ కలెక్టర్ పావార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ కె.శ్రీనివాసరావులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ స్వరాజ్యంతోపాటు పరిశుభ్రతకు మహాత్ముడు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఆ సందేశాన్ని ఆచరిస్తూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఏఓ పూర్ణచంద్రరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు ఇస్మాయిల్, మల్లేశ్వరి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పితృకార్యాలు




అమరావతి : అమరా రామక్షేత్రంలో బుధవారం మహాలయ అమావాస్యను పురస్కరించుకుని పలువురు తమ పితృదేవతలకు భక్తిశ్రద్ధలతో పితృకార్యాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు కాలం చేసిన తమ తల్లిదండ్రులు, బంధువులకు పిండ ప్రదానం చేసి .. ఆ పిండాలను కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. అనంతరం భక్తులు పవిత్ర కృష్ణానదిలో స్నానమాచరించి బాల చాముండికా సమేత అమరేశ్వరుడిని దర్శించుకున్నారు.

విజయకీలాద్రిపై ప్రత్యేక పూజలు

తాడేపల్లిరూరల్ : సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ భాద్రపద అమావాస్యను పురస్కరించుకుని శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళ శాసనాలతో కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

పులిచింతల వద్ద మొసలి



అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుపై బుధవారం ఉదయం మొసలి సంచరించడాన్ని స్థానికులు గమనించారు. ఈ విషయాన్ని కొందరు ప్రాజెక్టు నిర్వాహకులకు తెలియ చేయడంతో వారు వచ్చి మొసలిని ప్రాజెక్టు స్టాక్ పాయింట్ లోకి పంపించారు. ప్రాజెక్టు మీదుగా వెళ్లే పాదచారులు, నదిలో స్నానాలకు వెళ్లేవారు జాగ్రత్త వహించాలని తహసీల్దారు జి.శ్రీనివాస యాదవ్ ఈ సందర్భంగా సూచించారు.

ఉచితంగా ఇసుక ఇస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు ఊరించారు.. తీరా గెలిచాక పన్నుల పేరుతో సామాన్యుడికి పోటు పొడిచారు. ఎడాపెడా భారం వేసేశారు. ఇసుక కొందామంటే మూడు జిల్లాలకు ఒక్క స్టాక్ పాయింటే అందుబాటులో ఉంచారు. అక్కడా ఆన్‌లైన్ విధానం అంటూ మళ్లీ మెలిక పెట్టారు. స్లాట్ బుక్ చేసుకోవాలని చెప్పారు. తీరా చూస్తే అర్ధరాత్రి వేళ స్లాట్ ఓపెన్ కావడం... అర్ధగంటలో బుకింగ్ అయిపోవడం గమనార్హం. తెలుగు తమ్ముళ్లు, వారికి తెలిసిన రియల్టర్లు మొత్తం బుక్ చేసుకుంటున్నారు. మరోవైపు ఇసుక దొరక్క నిర్మాణ రంగం కుదేలైంది. దానిపై ఆధారపడిన లక్షల కార్మిక కుటుంబాలు పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వ పాలనలో నిస్సిగ్గుగా సాగుతున్న దారుణ మోసమిది.



అర్ధరాత్రి స్లాట్..

అరగంటలో ఔట్!

- ఇదీ.. ఇసుక ఆన్‌లైన్ విధానం తీరు
- ఉచితం పేరిట సర్కారు అడ్డగోలు దోపిడీ
- సామాన్యులు కొందామన్నా లభిస్తే ఒట్టు
- ఇసుక దొరక్క కుదేలైన నిర్మాణ రంగం
- భవన నిర్మాణ కార్మికులకు అవస్థలు

తెలిసిన రియల్టర్లు, తెలుగు తమ్ముళ్లకే ఇసుక బుకింగ్

సాక్షి ప్రతినిధి, గుంటూరు : ఉచిత ఇసుక అంటూ కూటమి ప్రభుత్వం ప్రచారం చేస్తున్నా అది బంగారంగా మారిపోయింది. సరైన ప్రణాళిక లేకుండా వ్యవహరిస్తుండటంతో జిల్లాలో ఎవరికీ దొరకని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో భవన నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించి గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం స్టాక్‌పాయింట్ వద్ద మాత్రమే ఇసుక అందుబాటులో ఉంది. దీంతో మూడు జిల్లాల వారు ఇక్కడే బుక్ చేసుకోవాల్సి రావడంతో రద్దీ పెరిగింది. కొత్తగా ఆన్‌లైన్ విధానం అని పెట్టి అర్ధరాత్రి స్లాట్ ఇస్తున్నారు. 500 మందికి మాత్రమే బుక్ చేసుకునే అవకాశం ఉండటంతో రియల్టర్లు రంగంలోకి దిగారు. తమ మనుషులతో స్లాట్ ప్రారంభం కాగానే బుక్ చేయించేస్తున్నారు. దీంతో అరగంటలోనే స్లాట్ పూర్తి అయిపోతోంది. సామాన్యుడికి ఒక్క లారీ కూడా అందని పరిస్థితి. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత స్లాట్ ఓపెన్ చేస్తే కొద్దిసేపటికే పోర్టల్ నిలిచిపోయింది. బుకింగ్ అయిపోయిందని, మళ్లీ వారం తర్వాత ఓపెన్ అవుతుందని చెబుతున్నారు. అసలు స్లాట్ ఎప్పుడు ఓపెన్ అవుతుందన్న విషయం తెలుగు దేశం నాయకులు, మైనింగ్ సిబ్బందికి మాత్రమే తెలియడంతో వారి సహకారంతో రియల్టర్లు పూర్తిస్థాయిలో బుక్ చేసేశారు. మామూలు ప్రజానీకానికి ఒక్కరికి కూడా ఇసుక బుక్ కాలేదు.

కార్మికుల కడుపు కొడుతున్న సర్కారు

గతంలో తహసీల్దార్ కార్యాలయంలో కూపన్లు ఇచ్చేవారు. ఆ సమయంలో కొంత పక్కదారి పట్టినా.. మిగిలిన కూపన్లు కొందరికైనా అందేవి. ఆన్‌లైన్ పేరుతో ఇసుకను ఎవరికీ అందకుండా ప్రభుత్వం చేసేసింది. దీంతో చాలాచోట్ల ఇసుక దొరక్క నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో ఈ నెల నాలుగున అన్ని మండలాల్లో ధర్నాలకు సీఐటీయూ పిలుపునిచ్చింది. ఇసుక దొరక్కపోవడంతో బ్లాక్ మార్కెట్‌లో లారీ రూ.30 వేల నుంచి రూ.40 వేలు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది. అత్యవసర పనులు ఉన్న వారు ఎంతైనా వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు భవన నిర్మాణ రంగం పడుతున్న ఇబ్బందులపై క్రెడాయ్ కూడా స్పందించింది. ఆ సంస్థ అధ్యక్షుడు ఆళ్ల శివారెడ్డి నేతృత్వంలో ప్రతినిధులు ఇప్పుడున్న పరిస్థితిని జిల్లా కలెక్టర్‌ను కలిసి వివరించారు. మరో 15 రోజుల్లో కొత్త రీచ్‌లను అందుబాటులోకి తెస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో అప్పటి వరకు ఇసుక అందే పరిస్థితి కనపడటం లేదు. పగటి పూట స్లాట్ ఓపెన్ చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 6వ తేదీన స్లాట్ ఓపెన్ కానుంది.

ఇప్పుడే ధర ఎక్కువ



కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుక అని హామీ ఇచ్చారు. ఎవరికీ అందడం లేదు. అంతకుముందు కంటే ఇప్పుడే అధిక ధర ఉంది. లారీలు ఇసుక కోసం రెండు, మూడు రోజులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. బాడుగలు, డ్రైవర్‌కు మాములు వంటి భారాలన్నీ ఇంటి యజమానిపై పడుతున్నాయి. నిర్మాణ రంగంలో పనుల్లేక కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ఓ కార్మికుడు అప్పు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడు.

– పుప్పాల సత్యనారాయణ, భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీఐటీయూ

రేపు ధర్నాలు చేస్తాం



కూటమి ప్రభుత్వం మాట తప్పింది. ఉచిత ఇసుక అని హామీ ఇచ్చి పాత ధరకంటే అధికంగా విక్రయించడం వల్ల పనులు లేక కార్మికులు రోడ్డు పాలవుతున్నారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 4వ తేదీన అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడుతాం. కార్మికులకు చేతి నిండా పనులు లేక అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇసుక ధర పెరగడం, కొందామన్నా దొరక్కపోవడం వల్ల నిర్మాణాలు కూడా నిలిచిపోయాయి.

– నన్నపనేని శివాజీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

ఉచిత ఇసుక ఎక్కడ ?

ఇసుక ధర పెరగడం వల్ల మేస్త్రీలు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేరుకే ఉచిత ఇసుక అని చెబుతున్నారు. వాస్తవంలో ఎక్కడ ఇస్తున్నారు? నా వద్ద 40 మంది కార్మికులు ఉన్నారు. ఇసుక లేక పనులు ఆగిపోయాయి. మొన్నటి వరకు వరదలు ఇబ్బంది పెట్టగా... ఇప్పుడు ఇసుక ధర పెరుగుదలతో కార్మికులకు పనులు లేవు. వారికి అడ్వాన్సులు ఇచ్చి ఆర్థికంగా మేమూ బాధలు పడుతున్నాం.

– వలిబోయిన శ్రీనివాసరావు, కొప్పురావూరు, తాపీమేస్త్రీ

నిర్మాణ పనులు నిలిపివేత



కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పేరుతో మోసం చేస్తోంది. ఇంటి యజమానులు పనులు నిలిపేశారు. ఏమైందని అడిగితే ఇసుక ధర లారీ రూ.30 వేలు ఉందని, ధర తగ్గినప్పుడు పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారు. దీంతో పని లేక కార్మికులందరూ ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం మాత్రం ఉచిత ఇసుక అని చెప్పి ధరలు విపరీతంగా పెంచేసింది.

– బండిల శ్రీనివాసరావు, కార్పెంటర్ మేస్త్రీ, అరుంధతీ నగర్

అహింసతో సాధించిన విజయం గొప్పది

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- బాపూజీ ఆశయాలు భావితరాలకు తెలియజేయాలి
- గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ పార్టీ పరిశీలకుడు మోదుగుల
- వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అంబటి, మోదుగుల, పార్టీ నేతలు

పట్నంబజారు: హింసతో సాధించే గెలుపు కన్నా... అహింసతో సాధించిన విజయం ఎంతో గొప్పదని చాటి చెప్పిన మహనీయుడు మహాత్మా గాంధీ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు చెప్పారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ.. సత్యం, అహింసలను తన అస్త్రాలుగా మార్చుకుని దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టిన మహనీయుడు పూజ్య బాపూజీ అని కీర్తించారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లే దిశగా వైఎస్సార్ సీపీ పాటు పడుతుందని స్పష్టం చేశారు.

గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యమే ఊపిరిగా ముందుకు సాగిన మహనీయుడు గాంధీ అని చెప్పారు. మహాత్ముడు చూపిన దారిలో నేటి యువత ముందుకు సాగాలన్నారు. భావితరాలకు మహనీయుల త్యాగాలను వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా కూడా మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, పార్టీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, లాలుపురం రాము, పోలూరి వెంకటరెడ్డి, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, మండేపూడి పురుషోత్తం, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ, రామనబోయిన అజయ్‌యాదవ్, పడాల సుబ్బారెడ్డి, ఆబిద్‌బాషా, అంబేద్కర్, పూనూరి నాగేశ్వరరావు, దూపాటి వంశీ, మెహమూద్, మార్కెట్‌బాబు, యాట్ల రవి, రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, మర్రి అంజలి, పార్టీ నేతలు, అనుబంధ విభాగాలు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి పదవీ స్వీకార సభకు ఏర్పాట్లు

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అంబటి రాంబాబు, గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల పరిశీలకుడిగా మోదుగుల వేణుగోపాలరెడ్డి నియమితులైన విషయం విదితమే. ఈ నెల 4న సాయంత్రం 4 గంటలకు గుంటూరు నగరంలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పదవీ స్వీకార సభ జరగనుంది. కార్యక్రమానికి పార్టీ నేతలు హాజరు కానున్న నేపథ్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు జిల్లాల నుంచి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రానున్నారు.

స్వచ్ఛతకు గాంధీ అధిక ప్రాధాన్యం

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



ప్రతిజ్ఞ చేయిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, పక్కన జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తదితరులు

నెహ్రూనగర్: స్వచ్ఛతకు మహాత్మా గాంధీజీ అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. దేశంలో పరిశుభ్రత పాటించటం వల్ల ఆరోగ్యకరమైన సమాజానికి పునాది వేయవచ్చని మహాత్ముడు నమ్మారని పేర్కొన్నారు. బుధవారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన స్వచ్ఛతా హి సేవ ముగింపు కార్యక్రమంలో మంత్రి చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు ఎండీ నసీర్ అహ్మద్, గల్లా మాధవి పాల్గొన్నారు. ముందుగా జ్యోతి వెలిగించి గాంధీజీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేంద్ర సహాయ మంత్రి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం, సమానత్వం, అహింస కోసం గాంధీజీ నిరంతరం కృషి చేశారన్నారు. పరిసరాల పరిశుభ్రతలో కీలక భూమిక పోషించే పారిశుద్ధ్య కార్మికుల ఆత్మాభిమానం పెంచేలా అన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గుంటూరు నగరాన్ని క్లీన్, గ్రీన్‌గా మార్చేందుకు నిర్వహించే అన్ని కార్యక్రమాలకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ.. జిల్లాలో స్వచ్ఛత కోసం సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ.. మెరుగైన పారిశుద్ధ్యంలో గుంటూరు నగరాన్ని ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని, పీఎఫ్ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన పారిశుద్ధ్య కార్మికులను జ్ఞాపిక, నూతన వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమానికి సహకారం అందించిన వివిధ సంస్థల ప్రతినిధులకు, పాల్గొన్న విద్యార్థులకు, ఎన్‌సీసీ వలంటీర్లకు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. ముందుగా గాంధీ జయంతి సందర్భంగా నగరపాలక సంస్థ సమీపంలోని హిమని సెంటరులోని మహాత్ముని విగ్రహానికి కేంద్ర సహాయ మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వీపింగ్ మిషన్లను లాంఛనంగా ప్రారంభించారు. తర్వాత సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతా హి సేవ మాస్ క్లీనింగ్, మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రికి

ఉత్సవ శోభ

ఇంద్రకీలాద్రిపై నెలకొన్న శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం దసరా మహోత్సవాలకు ముస్తాబైంది. గురువారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు 12వ తేదీ శనివారంతో ముగుస్తాయి. ఈ పది రోజుల్లో 15 లక్షల మంది భక్తులు విచ్చేస్తారని అంచనా. ఉత్సవాలు ముగిసిన రెండు, మూడు రోజుల వరకు కూడా భవానీల రద్దీ కొనసాగుతుంది.



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి దుర్గమ్మను విశేష అలంకారాలలో దర్శించుకోనున్నారు. మూలవిరాట్‌కు విశేష అలంకరణ జరుగుతుండటంతో పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి విచ్చేస్తుంటారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని దేవదాయ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు చెబుతున్నారు. రైలు, బస్సుల్లో నగరానికి చేరుకునే భక్తులు దేవస్థానం బస్సులతో పాటు ప్రయివేటు వాహనాలలో వీఎంసీ కార్యాలయం వరకు చేరుకుంటారు. అక్కడే దేవస్థానం ఏర్పాటు చేసిన క్లోక్‌రూమ్‌లలో లగేజీ భద్రపరుచుకుని కెనాల్‌రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి క్యూలైన్‌లోకి చేరుకోవచ్చు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక పాయింట్లు ఏర్పాటు చేశారు. అనంతరం కెనాల్ రోడ్డుకు చేరుకుని క్యూలైన్ లోకి ప్రవేశించవచ్చు. హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వారి కోసం భవానీపురం పరిసరాలలో వాహనాలను నిలుపుకొని హెడ్‌వాటర్ వర్క్సు నుంచి ప్రారంభమయ్యే క్యూలైన్ల ద్వారా ఆలయానికి చేరుకోవచ్చు. స్నానఘాట్లకు సమీపంలోనే పార్కింగ్ ప్రదేశాలు ఉండేలా పోలీసు శాఖ చర్యలు తీసుకుంది. రూ.500 టికెట్‌పై అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తుల కోసం దేవస్థానం అదనపు టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేసింది. వినాయకుడి గుడి నుంచి ప్రారంభమయ్యే క్యూలైన్లలో టోల్‌గేట్, ఓం టర్నింగ్, ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి ప్రాంగణం వద్ద టికెట్ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయి. ఇవే కాకుండా సీతమ్మ వారి పాదాలు, పున్నమి ఘాట్, స్టేట్ గెస్ట్ హౌస్‌లలో వీఐపీ టికెట్ల కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాలలో టికెట్లు కొనుగోలు చేసిన భక్తులను దేవస్థానం తమ వాహనాలపై ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వరకు చేరుస్తుంది. అక్కడి నుంచి క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకోవచ్చు.

దుర్గగుడిపై నేడు

- తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం
- శ్రీబాల త్రిపుర సుందరీదేవిగా అలంకరణ, నిత్య పూజలు
- ఉదయం 9 గంటలకు అమ్మవారి దర్శనం
- ఉదయం 10 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన, ప్రత్యేక శ్రీచక్రనవార్చన, ప్రత్యేక చండీహోమం
- సాయంత్రం 6 గంటలకు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల నగరోత్సవ సేవ
- సాయంత్రం 6–30 గంటలకు అమ్మవారికి మహానివేదన, పంచహారతులు
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం

– ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **3,800** గరిష్టం : రూ. **6,000**

మోడల్ ధర రూ. **5,000**

క్లుప్తంగా

మద్యం పాలసీపై మహిళా సంఘాల నిరసన



లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం మద్యం పాలసీని వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ప్రతిఘటన తప్పదని మహిళా సంఘాల నాయకులు హెచ్చరించారు. విధానాన్ని మార్చడం అంటే షాపుల సంఖ్య పెంచడమే కాకుండా, బార్‌లు అర్ధరాత్రి 12 గంటల వరకు తెరిచి ఉంచడానికి అవకాశం ఇవ్వడమేనని ఐద్వా జిల్లా కార్యదర్శి అరుణ అన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై శంకర్ విలాస్ సెంటర్‌లో బుధవారం ఐద్వా, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఐద్వా నగర అధ్యక్షులు జి.రమణ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మద్యాన్ని ఎక్కువ రేటుకి అందించిందని, కూటమి ప్రభుత్వం ఇప్పుడు తక్కువ ధరకు ఇస్తామని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. మద్యం మత్తులో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలు చూస్తూ కూడా ప్రభుత్వం మహిళలకు భరోసా ఇవ్వలేకపోతోందని పేర్కొన్నారు. మద్యం విధానాన్ని మార్చుకోకపోతే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర ,కార్యదర్శి ఎ.కళ్యాణి, కె.పద్మ, కృష్ణకుమారి, షకీలా, సీఐటీయూ నాయకులు కాశీం షహీద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్. నగర కార్యదర్శి సమీర్ యశ్వంత్, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇసుక సమస్యపై సీపీఎం ధర్నా



లక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టాలని ఈ నెల 4వ తేదీన అన్ని మండల, పట్టణ కేంద్రాలలో ధర్నా కార్యక్రమాలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం.రవి అధ్యక్షతన బుధవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. బుకింగ్‌కు ఆన్‌లైన్ విధానం తెచ్చినా ఆచరణలో పేదలకు ఇసుక అందడం లేదన్నారు. ఈ స్థితిలో 4వ తేదీన పార్టీ ఆధ్వర్యంలో జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా నాయకులు వై.నేతాజీ, ఈమని అప్పారావు, ఎన్.భావన్నారాయణ, ఎస్.ఎస్.చెంగయ్య, డి.వెంకటరెడ్డి, బి.వెంకటేశ్వరరావు, బి.కోటేశ్వరమ్మ, ఎం.ఎ.చిష్టీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



లక్ష్మీపురం: గాంధీ ఆశయాలకు అనుగుణంగా అందరూ నడవాలని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లోని బుధవారం గాంధీ చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సీపీఓ మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఎంఈ రవికిరణ్, డీసీఎం ప్రదీప్‌కుమార్, ఏడీఎంఈ రవీంద్ర, ఏడీఎంఈ బాపయ్య, ఏఎస్‌సీ శైలేష్‌కుమార్ పాల్గొన్నారు.

కన్నీటిపైనా కుటిల రాజకీయాలు!

- పంట నష్టపోయిన అన్నదాతలకు తీవ్ర అన్యాయం
- కూటమి నేతల ఒత్తిడితో పరిహారంలో మొండిచేయి

భారీ వర్షాలు, వరదల కారణంగా అన్నదాతలు నట్టేట మునిగారు. ఆర్థిక నష్టాలతో పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయారు. పంట నష్ట పరిహారంగా ఎకరాకు రూ.10 వేల చొప్పునైనా ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం నానా విన్యాసాలు చేసింది. అమలులో మళ్లీ రైతులకు అన్యాయమే చేసింది. పక్షపాతంతో కొందర్ని పరిహారం జాబితా నుంచి తప్పించగా, కౌలు రైతులను అసలు లెక్కలోకి కూడా తీసుకోకుండా పక్కన పెట్టేసింది.



వీరనాయకునిపాలెం గ్రామంలో వరదలకు దెబ్బతిన్న వరి పొలం

చేబ్రోలు: మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 15 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇటీవల భారీ వర్షాలకు మండలంలోని శేకూరు, శలపాడు, వీరనాయకునిపాలెం గ్రామాల్లోని పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటితోపాటు సుద్దపల్లి, వేజండ్ల, నారాకోడూరు, చేబ్రోలు, గొడవర్రు గ్రామాలలో పంట నష్టం వాటిల్లింది. సుమారు ఐదు వేల ఎకరాలకు పైగా పంట దెబ్బతింది. అధికారులు అంచనాలు తయారు చేసి 3,671 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తగ్గించేశారు. బాధితుల జాబితా తయారు చేసి పంపారు. వారికి మాత్రమే పరిహారం కింద ఎకరానికి రూ.పది వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు.

అంచనాల్లోనే పక్షపాతం

నష్టం అంచనా వేసే సమయంలోనే అధికార పార్టీ నాయకులు ఒత్తిడి తెచ్చారు. వాస్తవంగా పంట దెబ్బతిన్న రైతులకు అన్యాయం చేశారు. స్థానిక నేతలు తమకు అనుకూలమైన వారికి మాత్రమే జాబితాలో చోటు కల్పించారని బాధితులు ఆరోపిస్తున్నారు. శేకూరు, వీరనాయకునిపాలెం, శలపాడు గ్రామాలకు చెందిన రైతులు దీనిపై జిల్లా కలెక్టర్‌కు, మండలాధికారులకు ఫిర్యాదులు చేశారు.

కొందరికే సాయం

వీరనాయకునిపాలెం మైనర్ గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 600 ఎకరాల విస్తీర్ణంలో 90 శాతం పంట దెబ్బతింది. పొలాల్లో 10 నుంచి 15 రోజుల పాటు వర్షపు నీటితో ముంపు తప్పలేదు. ఇక్కడ మూడు వందల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు తేల్చారు. కొందరికే పరిహారం అందింది. మిగతా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి, గుంటూరు తదితర ఎగువ ప్రాంతాల నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా వరద పోటుతో గ్రామానికి చెందిన రైతులు కోలుకోలేని విధంగా నష్టపోయారు. ఏపుగా పెరిగిన వరి మొక్కలు నీటిలో మునిగిపోవటంతో ఉరకెక్కి, చచ్చిపోయాయి. మళ్లీ సాగు చేయటానికి సమయం దాటిపోయింది. పెట్టుబడికి కూడా దిక్కులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమీప ప్రాంతాల్లోని రైతులు నరసరావుపేట, వినుకొండ తదితర ప్రాంతాలకు వెళ్లి నారు తెచ్చి సాగుకు సిద్ధమయ్యారు. దీంతో రైతులకు ఖర్చు రెట్టింపు అయింది. ఇలాంటి దుస్థితిలో ఉన్న రైతులను అధికార పార్టీ నాయకులు ఆదుకోవాల్సింది పోయి పరిహాసం ఆడుతున్నారు. కొద్ది రోజుల క్రితం నాయకులు చెప్పిన వారికే పంట నష్టపరిహారం అందింది.

ఇక్కడా రాజకీయాలే..!

అసలైన బాధిత రైతులను వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పట్టించుకోవటం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన సుమారు 50 మంది రైతులకు పరిహారం అందించకుండా అధికారులను అడ్డుకున్నారు. దీంతో వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రైతు సంఘం నాయకులతో కలిసి ఉద్యమించటానికి సిద్ధమవుతున్నారు.

పరిహారం అందించి ఆదుకోవాలి



గతంలో ఎన్నడూ లేని విధంగా కాలువలు, డ్రెయిన్‌లు పొంగి ప్రవహించటంతో పంటలు మునిగి పూర్తిగా దెబ్బతిన్నాయి. మూడు ఎకరాలను రూ.90 వేలకు పల్లపోతుల సూర్యనారాయణ వద్ద కౌలుకు తీసుకొన్నా. ఖర్చులకు రూ.50 వేలకుపైగా అయింది. ఆర్థికంగా పూర్తిగా నష్టపోయా. ప్రభుత్వం ఆదుకోవాలి. జాబితాలో నా పేరు తొలగించడంతో తీరని అన్యాయం జరిగింది.

– వోగిబోయిన నాగార్జున, కౌలు రైతు, వీరనాయకునిపాలెం

పంట నష్టం నమోదులో పక్షపాతం



పంట నష్ట నమోదులో అధికారులు పక్షపాత వైఖరిని అవలంబించారు. నేను ఐదు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాను. వానలు ముంచాయి. పంట దెబ్బతింది. మళ్లీ నారు కొనుగోలు చేసి నాట్లు వేస్తున్నాను. ఖర్చు రెట్టింపు అయింది. లక్షలాది రూపాయలు నష్టపోయాను. వ్యవసాయశాఖ అధికారులు కాగితాలు తీసుకున్నారు. పరిహారం వస్తుంది... కొద్ది రోజులు వేచి చూద్దాం.. అని కాలయాపన చేస్తున్నారు.

– ధూళ్ల వెంకట్రావు, రైతు, వీరనాయకునిపాలెం

అర్హులకు అందించలేదు



పరిహారం విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు మోసం చేశారు. తీవ్రంగా నష్టపోయిన వారికి ఆర్థిక సాయం అందలేదు. అనుకూలమైన వారి పేర్లు మాత్రమే చేర్చారు. నేను రెండు ఎకరాల్లో నిమ్మ, 40 సెంట్లలో కాకర, ఎకరన్నరంలో మాగాణి పొలం సాగు చేస్తున్నాను. పూత, పిందె మీద ఉన్న నిమ్మతోట బాగా దెబ్బతింది. కాకర పందిరి ఉరకెత్తి చచ్చిపోయింది. పరిహారం కావాలనే ఇవ్వలేదు.

– తోక సుబ్బారావు, రైతు, వీరనాయకునిపాలెం

పంట మునిగినా సాయమేదీ?



భారీ వర్షాలకు నాకున్న రెండు ఎకరాల వరి పొలం మునిగిపోయింది. పంట పూర్తిగా దెబ్బతింది. మళ్లీ సాగు చేసే పరిస్థితి కూడా లేదు. ఇప్పుడు వచ్చి చూసినా అధికారులకు ఆ విషయం తెలుస్తుంది. అధికారులు కాగితాలు తీసుకున్నారు. పరిహారం మాత్రం నాకు దక్కలేదు. కొందరు నాయకులు తమకు అనుకూలమైన వారికే పరిహారం అందించారు. వెంటనే న్యాయం చేయాలి.

– కాసుల శివయ్య, రైతు, వీరనాయకునిపాలెం

దసరా సెలవులపై ఎవరి దారి వారిదే..!

- 3 నుంచి 13వ తేదీ వరకు ప్రకటించిన విద్యాశాఖ మంత్రి లోకేశ్
- 3, 4, 5వ తేదీల్లో ప్రైవేటు స్కూళ్ల నిర్వహణకు కమిషనర్ అనుమతి

గుంటూరు ఎడ్యుకేషన్: దసరా సెలవులపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఎవరికి ఇష్టం వచ్చినట్లుగా వారు వ్యవహరిస్తున్నారు. పాఠశాలలకు ఈ నెల 3 నుంచి 13 వ తేదీ వరకు సెలవులు ఇస్తున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ ప్రకటించారు. దీనికి అనుగుణంగా విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు సైతం విడుదల చేశారు. ఈ మేరకు గుంటూరు జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలకు డీఈవో పి.శైలజ సెలవులను సైతం ప్రకటించారు. ఈ నెల 3, 4, 5వ తేదీల్లో పాఠశాలలు కొనసాగుతాయంటూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పిల్లల తల్లిదండ్రులకు సమాచారం పంపాయి. గత నెలలో భారీ వర్షాల కారణంగా ఇచ్చిన సెలవులను సర్దుబాటు చేసుకునేందుకు అనుమతించాలని కోరుతూ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కమిషనర్‌ను కోరగా, అందుకు అనుమతించినట్లు తెలిసింది. ఫలితంగా ప్రైవేటు పాఠశాలలు ఈ నెల 3,4,5వ తేదీల్లో యథావిధిగా పని చేయనుండగా, ప్రభుత్వ పాఠశాలలకు మాత్రం సెలవులుగా పరిగణించనున్నారు. వాస్తవానికి వర్షాల సమయంలో ప్రభుత్వ పాఠశాలలు సైతం మూతపడ్డాయి.

150 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

తెనాలిరూరల్: మండలంలోని కొలకలూరు, పెదరావూరు గ్రామాల్లో అక్రమంగా తరలిస్తున్న 150 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొలకలూరులో మంగళవారం అర్ధరాత్రి వాహన తనిఖీ చేసి, 100 రేషన్ బియ్యం బస్తాలను గుర్తించారు. పెదరావూరులో మరో వాహనంలో 50 బస్తాలు చిక్కాయి. బియ్యం సహా రెండు వాహనాలను సీజ్ చేయగా.. వాటి డ్రైవర్లను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు.

మహాత్ముడి మార్గం అనుసరణీయం



మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ



గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పించిన హెనీ క్రిస్టినా, ఉద్యోగులు



గుంటూరు కోవిడ్ ఫైటర్స్‌కు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

నగరంపాలెం: మహాత్మాగాంధీ ఆదర్శాలు, విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జాతిపిత జయంతి వేడుకలను జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి జిల్లా ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. బాపూజీ చూపిన అహింసా, సత్యం సిద్ధాంతాలు నేటి పాలకులు, ప్రజలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, ఎస్బీ డీఎస్పీ బి.సీతారామయ్య, ఆర్ఐ బ్రహ్మానందం, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాల సాధనకు కృషి

గుంటూరు ఎడ్యుకేషన్: మహనీయులైన మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల ఆశయాల సాధనకు కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా ఆ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ.. గాంధీ అడుగు జాడలను అనుసరించి ఒకరికొకరు తోడుగా ఉండాలన్నారు. ఒకే దేశం, ఒకే కుటుంబంగా అందరూ కలిసి జీవించాలని కోరారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా జెడ్పీ కార్యాలయంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను శాలువా కప్పి, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, పరిపాలనాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా కారాగారంలో గాంధీకి నివాళి

నగరంపాలెం: గుంటూరు బ్రాడీపేటలోని జిల్లా కారాగారంలో బుధవారం మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి మాట్లాడుతూ.. గాంధీజీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. తద్వారా ప్రతి ఒక్కరూ తమ జీవితాలను అద్భుతంగా తీర్చిదిద్దుకోవాలని చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి మాట్లాడుతూ.. ఏ ఒక్కరూ నేరాల జోలికి పోవద్దని చెప్పారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. ఎంత పెద్ద నేరం చేస్తే అంత గొప్ప అనే అహం వీడాలని అన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన ఖైదీలకు బహుమతులు అందించారు. గుంటూరు కోవిడ్ ఫైటర్స్ ట్రస్ట్ సేవలను గుర్తించి, నిర్వాహకులు పఠాన్ అల్లాబక్షుకు జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ కె.రఘు, జైలర్ బి.తేజేశ్వర్‌రావు, డిప్యూటీ జైలర్లు ఎ.కల్యాణ్‌బాబు, కె.అశోక్, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గాంధీ సిద్ధాంతాలు ఆదర్శం



ఏఎన్‌యూ: గాంధీ చూపిన మార్గం యువతకు సదా ఆదర్శమని వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సెంటర్ ఫర్ గాంధీయన్ స్టడీస్ ఆధ్వర్యంలో బుధవారం గాంధీ జయంతి నిర్వహించారు. సెంటర్ డైరెక్టర్ ఆచార్య కె. సోమశేఖర్ అధ్యక్షత వహించారు. మహాత్ముడి విగ్రహానికి వీసీతోపాటు రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సీహెచ్ స్వరూపారాణి, ప్రిన్సిపల్స్ కే వీరయ్య, పి.జాన్సన్, పి.సిద్ధయ్య, యూజీసీ కోఆర్డినేటర్ ఆచార్య వై.అశోక్ కుమార్, బాలుర వసతి గృహాల చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతా హి సేవలో అందరూ భాగస్వాములు కావాలి

సీజీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డి



వాకథాన్‌లో కమిషనర్ సాధు నరసింహారెడ్డి తదితరులు

లక్ష్మీపురం: దేశానికి స్వాతంత్ర్యం కంటే పారిశుద్ధ్యమే ముఖ్యమని ప్రకటించిన జాతిపిత ఆశయాలను అనుగుణంగా ప్రధాని ప్రకటించిన స్వచ్ఛ భారత్‌లో అందరూ పాలుపంచుకోవాలని గుంటూరు సీజీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛతా హి సేవలో భాగంగా గుంటూరు సీజీఎస్టీ కమిషనరేట్ పరిధిలోని విజయవాడలో బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని వాకథాన్ నిర్వహించారు. జీఎస్టీ, కస్టమ్స్, పాస్‌పోర్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి శివ హర్ష మాట్లాడుతూ క్లీన్ అండ్ గ్రీన్ ఇండియాపై అవగాహన పెంపునకు ఈ వాకథాన్ నిర్వహించినట్లు చెప్పారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. వాకథాన్‌లో జీఎస్టీ జాయింట్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ, సహాయ కమిషనర్లు బి.రవికుమార్, వీఎస్‌కే రాయలు, సీతారామరాజు సూపరింటెండెంట్లు సి.హెచ్. ఈశ్వరరావు, వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బుర్రిపాలెం రోడ్డులో యువకుడి హత్య

వివాహేతర సంబంధం కారణమని భావిస్తున్న పోలీసులు



కోటేశ్వరరావు (ఫైల్)

తెనాలి రూరల్: తెనాలి బుర్రిపాలెం రోడ్డు నుండి పూలే కాలనీ టిడ్కో గృహాలకు వెళ్లే మార్గంలో ఉన్న నిర్మానుష్య ప్రదేశంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. బుధవారం ఉదయం ఆ ప్రాంతంలో మృతదేహం ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ వీరంకి మల్లికార్జునరావులు సిబ్బందితో కలిసి వచ్చి విచారణ చేపట్టారు. ఒంటిపై కత్తి గాయాలతోపాటు గొంతు కోసి హతమార్చినట్లు గుర్తించారు. మృతుడు బుర్రిపాలెం గ్రామానికి చెందిన పేరిశెట్టి కోటేశ్వరరావు(38)గా గుర్తించారు. గతంలో హైదరాబాద్‌లో పలువురు సెలబ్రిటీల వద్ద బౌన్సర్‌గా అతడు పనిచేసినట్లు తెలిసింది. పలు పోలీస్‌స్టేషన్లలో ప్రైవేటు జీపు డ్రైవర్‌గా కూడా వ్యవహరించినట్లు సమాచారం. 15 రోజుల క్రితమే తెనాలి వచ్చాడని తెలిసినవారు చెబుతున్నారు. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో నందుల పేటలోని లిక్కర్ మాల్‌లో మద్యం కొనుక్కుని వెళ్లినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో గుర్తించారు. నిర్మానుష్య ప్రాంతంలో సిమెంట్ బల్లపై కూర్చుని మద్యం తాగినట్లు అక్కడ ఆనవాళ్లు ఉన్నాయి. ఇతనొక్కడే మద్యం తాగాడా? లేక ఎవరైనా తోడు ఉన్నారా? అనే కోణాలలో దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం ఉదయం తెనాలికి పనిపై వచ్చిన కోటేశ్వరరావు ఇంటికి వెళ్లలేదని కుటుంబ సభ్యులు చెప్పారని రూరల్ సీఐ శ్రీనివాసరావు వెల్లడించారు. హత్యకు కారణాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో స్నేహితుల మధ్య నెలకొన్న వివాదమే కోటేశ్వరరావు హత్యకు కారణంగా భావిస్తున్నారు. నిందితుడిని పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. రూరల్ పోలీసులు కేసు నమోదు చేయగా, సీఐ శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యావ్యవస్థలో 'గురుకులాల' పాత్ర కీలకం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



ఉత్తమ గురువులను సత్కరించిన ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, కె.రవిచంద్ర తదితరులు

లక్ష్మీపురం: ప్రభుత్వ విద్యారంగంలో గురుకుల పాఠశాలలు, కళాశాలలు దశాబ్దాలుగా ఉన్నత ప్రమాణాలతో రాణిస్తున్నాయని శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. అక్కడ పనిచేసే సిబ్బంది అంకితభావంతో కృషి చేయటం అభినందనీయమన్నారు. వి.ఎస్.ఆర్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉత్తమ గురుకుల ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం స్థానిక బ్రాడీపేట సీపీఎం కార్యాలయం గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ టీచర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కే రవిచంద్ర, ఫౌండేషన్ చైర్మన్ ప్రొఫెసర్ మరియా రోజాలు మాట్లాడుతూ.. గురుకుల విద్యా వ్యవస్థ చేస్తున్న సామాజిక కార్యక్రమాలకు అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు. సభకు అధ్యక్షత వహించిన ఫౌండేషన్ కో చైర్మన్ డాక్టర్ పీవీ మల్లేశ్వర్ మాట్లాడుతూ.. ఫౌండేషన్, కృతి స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఉపాధ్యాయులకు సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల నుంచి ఎంపిక చేసిన ఉత్తమ గురువులను సత్కరించారు. విద్యాశాఖ డిప్యూటీ సెక్రటరీ ఆర్.వెంకటేశ్వర్లు ఏపీఆర్ఈఐఎస్ ఈ వెంకటరమణ, సొసైటీ జాయింట్ సెక్రటరీ ఊబేదుల్లా, బీసీఆర్ఈఐ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.బి.బి. రావు, డి.గోవింద్ రెడ్డి, రాపోలు జగన్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.